సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ၊ 6 ၊ ఏప్రిల్ ၊ 2024



ప్రజోపయోగకర పనులు చేయాలి

ప్రతి ఒక్కరూ ప్రజోపయోగకర పనులు చేసినప్పుడే సమాజం బాగుంటుందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. IIలో




..గోదావరి ఉరకలు

అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. IIలో

గరిష్టం / కనిష్టం
40° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం వరకు గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతూ ఉంటుంది.



న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

భద్రాద్రిలో నిత్యాన్నదానానికి విరాళాలు

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీ, తెలంగాణకు చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందజేశారు. గుంటూరులోని అగ్రహారం గ్రామానికి చెందిన వేమూరి రామచంద్రమూర్తి–లలిత దంపతులు రూ.1,08,009, సంగారెడ్డి జిల్లా భవానీపురానికి చెందిన అప్పికట్ల శ్రీరాములు – గీత దంపతులు రూ.50 వేలను ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం గావించారు. ఆ తర్వాత గణపతి హోమం, కుంకుమ పూజ తదితర అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.సుదర్శన్, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తుక్కు తరలింపుపై ఆరోపణలు

త్రిసభ్య కమిటీతో విచారణకు సీఎండీ ఆదేశం

పాల్వంచ : కేటీపీఎస్ పాత ప్లాంట్(ఓఅండ్ఎం) కర్మాగారంలో కూల్చివేతలతో తుక్కు తరలింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు ఇటీవల వెల్లువెత్తాయి. ఓ సంస్థ టెండర్ ద్వారా సుమారు రూ.450 కోట్లకు దక్కించుకుని, కట్టుదిట్టమైన చర్యల మధ్య తరలిస్తోంది. అయితే అనుమతులకు మించి తుక్కును తరలించి సంస్థకు రూ.కోట్ల మేర నష్టం చేస్తున్నారని ఇటీవల పలు పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలపై నూతన సీఎండీ రిజ్వీ సైతం ఆరా తీశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, గతంలో ఇచ్చిన టెండర్, తీసుకెళ్లిన ఇనుప సామగ్రి, నిబంధనలు ఏమైనా అతిక్రమించారా అనే కోణంలో నివేదిక ఇవ్వాలని విద్యుత్ సౌధ నుంచి డీఈ స్థాయి అధికారులు వీరస్వామి, పాండురంగారావు, మహిపాల్‌తో కమిటీ ఏర్పాటుచేశారు. కమిటీ సభ్యులు ఈ వారంలో కర్మాగారాన్ని సందర్శించి తగు నివేదిక సమర్పించనున్నారు.

‘మణుగూరు’లో మంటలు !



మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం

అర్ధంతరంగా సింగరేణి ఏరియా జీఎం బదిలీ

- కుల వివక్షే కారణమంటున్న రాంచందర్ రావు
- రిలీవ్ కావడానికి నసేమిరా అంటున్న వైనం
- సంస్థలో వివాదాస్పదంగా మారిన బదిలీ ప్రక్రియ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతిష్టాత్మకమైన సింగరేణిలో పాలన గాడి తప్పుతోంది అనేందుకు ‘మణుగూరు’ వివాదం నిదర్శనంగా నిలుస్తోంది. జనరల్ మేనేజర్ స్థాయి అధికారుల బదిలీల్లో సరైన ప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏరియా జీఎం బదిలీ..

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా 11 ఏరియాలు, ఒక కార్పొరేట్ ఆఫీస్ ఉన్నాయి. సంస్థ తరఫున వ్యవహారాలు నిర్వహించేందుకు ప్రతీ ఏరియాలో జనరల్ మేనేజర్ స్థాయిలో అత్యున్నత అధికారి ఉంటారు. ఇలా మణుగూరు ఏరియాకు 13 నెలల క్రితం దుర్గం రాంచందర్ రావు జీఎంగా నియమితులయ్యారు. సాధారణంగా మూడేళ్లు ఆ పదవిలో కొనసాగుతారు. ఏమైనా వివాదాలు, ఆరోపణలు చోటుచేసుకున్నప్పుడు అంతకంటే ముందే బదిలీలు జరగడం పరిపాటి. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందు గత మార్చి11న సంస్థ పరిధిలో ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. అందులో మణుగూరు జనరల్ మేనేజర్‌గా ఉన్న దుర్గం రాంచందర్‌ను హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాలయానికి బదిలీ చేశారు.

రిలీవ్‌కు నసేమిరా..

మూడేళ్ల పదవీ కాలం ముగియకుండానే తనను మణుగూరు నుంచి సీఎండీ కార్యాలయానికి బదిలీ చేయడం సరికాదంటూ రిలీవ్ అయ్యేందుకు దుర్గం రాంచందర్ నసేమిరా అంటున్నారు. బదిలీ ఉత్తర్వులు వెలువడి దాదాపు నెలరోజులు కావస్తున్నా ఆయన ఆ పోస్టు నుంచి రిలీవ్ కాలేదు. అంతే కాదు.. తాను దళితుడిననే వివక్ష చూపుతూ 2023లో జరిగిన డైరెక్టర్ పోస్టుల్లో తనకు రావాల్సిన పోస్టును అగ్ర వర్ణాలకు చెందిన వారికి కట్టబెట్టారంటూ సంచలన ఆరోపణలు చేశారు. డైరెక్టర్ కావాల్సిన తనను మణుగురు ఏరియాకు జీఎంగా పంపించారని చెబుతున్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారని సమాచారం. ప్రస్తుతం సింగరేణి సంస్థలో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చీఫ్ లైజన్ ఆఫీసర్‌గా రాంచందర్ ఉన్నారు. చీఫ్ లైజన్ ఆఫీసర్ హోదాలో ఉన్న ఆయనపైనే వివక్ష చూపిస్తున్నారని చెబుతున్న నేపథ్యాన.. ఇక సామాన్య కార్మికుల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది.

కొత్త జీఎంగా లలిత్‌కుమార్..

మార్చి 11న జరిగిన బదిలీల్లో ఎస్‌ఓ టు డైరెక్టర్ (ఆపరేషన్స్)గా ఉన్న లలిత్‌కుమార్‌ను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. సంస్థ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆయన తన పాత పోస్టు నుంచి రిలీవ్ అయి కొత్త పోస్టు కోసం డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్)కు రిపోర్టు చేశారు. అయితే మణుగూరు జీఎంగా రాంచందర్‌రావు రిలీవ్ కాకపోవడంతో ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఈ అంశంలో దుర్గం రాంచందర్ రావుకు సర్దిచెప్పేందుకు నేరుగా సీఎండీ బలరాం నాయక్ రంగంలోకి దిగినా ఫలితం కానరాలేదని సంస్థలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. దీంతో ఈ విషయం చినికిచినికి గాలివానలా తయారై చర్చనీయాంశంగా మారింది.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా..

కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన డి.లలిత్‌కుమార్ ఈ పోస్టుకు రాక ముందు మణుగూరు ఏరియాలో ఎస్‌ఓ టు జీఎంగా సుమారు మూడేళ్లు విధులు నిర్వహించారు. గతంలో ఒక ఏరియాలో పనిచేసిన అధికారికి తిరిగి అదే ఏరియాలో వెంటనే జీఎంగా బదిలీ చేసిన దాఖలాలు చాలా అరుదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ లలిత్‌కుమార్‌ను మణుగూరు జీఎంగా ఈఈ సెల్ అధికారులు నియమించడం అనుమానాలకు తావిస్తోంది. బదిలీల వ్యవహారం గందరగోళంగా మారడానికి రాజకీయ ఒత్తిళ్లే కారణమనే ప్రచారం జరుగుతోంది. యాజమాన్యం బదిలీ చేసిన చోటుకు వెళ్లి విధులు నిర్వహించాల్సిన అధికారులు.. ‘మేం ఆ ఏరియాకు వెళ్లం, ఇక్కడే పని చేస్తాం’ అన్నట్టుగా వ్యవహరించడం 135 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఎన్నడూ జరగలేదు. సంస్థ ఆదేశాలను జనరల్ మేనేజర్ స్థాయిలో ఉండే అధికారులే లెక్క చేయకుండా కింది స్థాయి ఉద్యోగులు, కార్మికులకు ఎలాంటి సంకేతాలు పంపుతున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్డర్లు పాటించాల్సిందే..

నిబంధనల ప్రకారం ఉద్యోగిని ఎప్పుడైనా బదిలీ చేసే అధికారం సంస్థకు ఉంది. సంస్థ ఆదేశాలను పాటించడం ఉద్యోగుల విధి. సంస్థ ఏ ఆర్డర్లు ఇచ్చినా ఉద్యోగులు పాటించాల్సిందే.

– ఎన్‌వీకే. శ్రీనివాస్, డైరెక్టర్(పా), సింగరేణి

రిలీవ్ చేయలేదు

మణుగూరు జీఎంగా ఏరియాను అన్ని విభాగాల్లో ముందంజలో నిలిపా. మరో ఏడాది ఇక్కడ పని చేసే అవకాశం ఇవ్వాలని కోరాను. సంస్థ నుంచి ఇంకా బదులు రాలేదు. బదిలీ ఆర్డర్లు వచ్చాయి కానీ రిలీవ్ ఆర్డర్లు రాలేదు.

– దుర్గం రాంచందర్‌రావు, జీఎం, మణుగూరు

భక్తులు పెరిగినా ఇబ్బందులు రానివ్వం



మాట్లాడుతున్న ఈఓ రమాదేవి, పక్కన ఆలయ అర్చకులు, సిబ్బంది

- రూ.10, 5 వేల టికెట్లు కలెక్టర్ ఆధీనంలోనే
- రెండున్నర లక్షల లడ్డూలు, 250 క్వింటాళ్ల తలంబ్రాలు సిద్ధం చేస్తాం
- 600 బస్సుల్లో 600 కేజీల తలంబ్రాలు పంపిణీ
- ఇకపై ఉగాది రోజే ఉత్సవాలకు అంకురార్పణ
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఆలయ ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం ఉత్సవాలకు ఈ ఏడాది భక్తులు పెరిగినా ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నవమి ఏర్పాట్ల గురించి వివరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో 16న సాయంత్రం వైకుంఠ ద్వారం వద్ద ఎదుర్కోలు ఉత్సవం, 17న మిథిలా స్టేడియంలో కల్యాణం, 18న మహాపట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఈ ఏడాది భక్తులు పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మిథిలా స్టేడియాన్ని 24 సెక్టార్లుగా విభజించామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ఏడాది సీఎం హాజరయ్యే అవకాశం లేనందున ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ సెక్టార్‌ను వీవీఐపీగా మార్చి 100 మందికి రూ.10 వేల టికెట్లు కేటాయిస్తున్నామని, రూ.5 వేల టికెట్‌తో వీఐపీ సెక్టార్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ రెండు సెక్టార్ల టికెట్లు కలెక్టర్ ఆధీనంలో ఉంటాయని తెలిపారు. పట్టాభిషేకం రోజున రూ. 5 వేలతో వీవీఐపీ, రూ.2,500తో వీఐపీ సెక్టార్లను విభజించామన్నారు. వేడుకల్లో స్వయంగా పాల్గొనలేని భక్తులకు పరోక్ష సేవల నిమిత్తం రూ.5వేలు, రూ.1,116 టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్చి 25న ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంచగా, శుక్రవారం ఉదయం వరకు నవమి టికెట్లు 11,440కి 1,244, పట్టాభిషేకానికి 2,450 టికెట్లకు 62 విక్రయించినట్లు వెల్లడించారు.

250 క్వింటాళ్ల తలంబ్రాలు..

భక్తులకు పంపిణీ చేసేందుకు గతేడాది 150 క్వింటాళ్ల తలంబ్రాలు తయారుచేయగా, ఈ ఏడాది 250 క్వింటాళ్లకు పెంచుతున్నట్లు ఈఓ తెలిపారు. పంపిణీకి 60 కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు 600 బస్సుల్లో 600 కేజీలు పంచనున్నట్లు వెల్లడించారు. ప్రసాదాలు పోస్టల్ ద్వారా విక్రయిస్తుండగా, తలంబ్రాలు పోస్టల్, ఆర్టీసీ కార్గో ద్వారా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది భక్తుల కోసం రెండున్నర లక్షల నాణ్యమైన లడ్డూలు తయారు చేస్తున్నామని, 19 కౌంటర్ల ద్వారా విక్రయిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ, దేవస్థానం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తున్నామని, తాత్కాలిక వసతి, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఉగాది రోజునే అంకురార్పణ..

దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి మాట్లాడుతూ.. వైదిక కమిటీ తీర్మానం మేరకు ఇకపై ప్రతీ ఏడాది ఉగాది రోజునే ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. దాతలు 12 స్వర్ణ పూత వాహనాలు ఇచ్చారని, 15 రోజుల పాటు వాహన, తిరువీధి సేవలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 17న శ్రీరామ పునర్వసు దీక్షా ధారణ, మే 5న విరమణ, గిరి ప్రదక్షిణ, ఇతర పూజలు ఉంటాయని వివరించారు. సమావేశంలో ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వేద పారాయణులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

జగ్జీవన్ జీవితం స్ఫూర్తిదాయకం

జయంతి వేడుకల్లో కలెక్టర్ ప్రియాంక ఆల



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వాతంత్య్ర సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల కొనియాడారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అత్యంత పేదరికంలో జన్మించిన జగ్జీవన్.. అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని అన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న బాబూజీ రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా సేవలందించారని తెలిపారు. స్వాతంత్య్రానంతరం తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కార్మికుల సంక్షేమానికి పాటుపడ్డారని చెప్పారు. కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన బాబూజీ రెండుసార్లు కేంద్ర వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవంలో కీలక పాత్ర పోషించారని, అంటరానితనం నిర్మూలనకు, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ప్రజలంతా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి అనసూర్య, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ గన్యా, డీఈఓ వెంకటేశ్వ రాచారి, డీపీఓ చంద్రమౌళి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి, డీఎస్‌ఓ రుక్మిణి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలగించబడిన జీడీఎస్‌లు తిరిగి విధుల్లోకి...

ఖమ్మంగాంధీచౌక్: నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఉద్యోగాల నుంచి తొలగించబడిన గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్)ను తపాలా శాఖ తిరిగి విధుల్లోకి తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖమ్మం తపాలా డివిజన్‌లో 256 మంది గ్రామీణ డాక్ సేవక్‌లను గురువారం నాటికి ఉద్యోగాల్లో నియమించారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జీడీఎస్‌ల జేఏసీ ఆధ్వర్యాన గత ఏడాది డిసెంబర్ 12 నుంచి నిరవధిక సమ్మెకు దిగగా.. మూడేళ్ల సర్వీస్ పూర్తికాని ఉద్యోగులు సమ్మెలో పాల్గొనవద్దనే నిబంధన కారణంగా ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో 256 మంది జీడీఎస్‌లను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇందులో గత నెలలోనే పది మందిని తిరిగి ఉద్యోగాల్లో నియమించగా, తాజాగా మిగతా 246 మందిని సైతం విధుల్లోకి తీసుకున్నారు. గ్రామీణ డాక్ సేవక్‌లను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడంపై తపాలా ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ వేంకటేశ్వర స్వామికి వైభవంగా చక్రస్నానం



చక్రస్నానానికి తరలివెళ్తున్న ఆలయ నిర్వాహకులు

పాల్వంచ : పట్టణంలోని శ్రీనివాసగిరి గుట్టపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా మహాపూర్ణాహుతి, చక్రస్నానం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల ఫణిరాజ్ ఆచార్యులు, సౌమిత్రి రామాచార్యులు, హరిచార్యులు, మణిదీప్ ఆచార్యులు, వరుణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, మిట్టపల్లి నరసింహారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, ఓం ప్రకాశ్ మంత్రి, జిన్నె రమేశ్, ఆకుల సత్యవతి, నాయిని సందీప్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కాసుల గలగల!

- 4వ తేదీన రీజియన్‌కు రూ.1.45 కోట్ల ఆదాయం
- మూడు డిపోల్లో వంద శాతం ఓఆర్



ఖమ్మంమయూరిసెంటర్: పెళ్లిళ్లతో పాటు వరుస సెలవులు ఆర్టీసీకి కలిసొస్తున్నాయి. సంక్రాంతి పండుగ తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిలో సంస్థకు ఆదాయం సమకూరుతోందని అధికారులు చెబుతున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు తోడు ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు ముగియడంతో వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో ఈనెల 4వ తేదీన(గురువారం) ఖమ్మం రీజియన్‌కు రూ.1,45,08,008 ఆదాయం సమకూరింది. రీజియన్‌లో ఏడు డిపోలకు గాను మూడు డిపోలు 100 శాతం ఓఆర్ సాధించడం విశేషం. ఇందులో ఖమ్మం డిపో రూ.35,21,795 ఆదాయం సాధించగా 103 శాతం ఓఆర్, కొత్తగూడెం డిపో రూ.16,80,649 ఆదాయంతో 108 శాతం ఓఆర్, మణుగూరు డిపో రూ.20,86,375 ఆదాయంతో 100 శాతం ఓఆర్ సాధించాయి. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ వేసవి సెలవులు ఆర్టీసీకి కలిసొస్తాయని, గణనీయమైన స్థాయిలో ఆదాయం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

డిపోల వారీగా 4వ తేదీన వచ్చిన ఆదాయం

డిపో	ఆదాయం	ఓఆర్
ఖమ్మం	రూ.35,21,795	103
మధిర	రూ.15,74,431	94
సత్తుపల్లి	రూ.25,45,288	96
భద్రాచలం	రూ.26,66,641	92
కొత్తగూడెం	రూ.16,80,649	108
మణుగూరు	రూ.20,86,375	100
ఇల్లెందు	రూ.4,32,829	96

చంద్రన్న నాయకత్వం నుంచి బయటకు..



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

టేకులపల్లి: పార్టీలో చోటుచేసుకున్న అంతర్గత విభేదాల కారణంగా ఎన్డీ కేంద్ర కమిటీ కార్యదర్శి చంద్రన్న నాయత్వంతో తామే తెగతెంపులు చేసుకున్నామని కేంద్రకమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని తొమ్మిదో మైలుతండాలో శుక్రవారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. 2013లో ప్రత్యేక పార్టీగా న్యూడెమోక్రసీ ఏర్పడి కొనసాగుతున్న క్రమంలో మొత్తం పార్టీని మౌలిక సిద్ధాంతాలకు, రాజకీయ అవగాహనకు అనుగుణంగా నడపాల్సిన చంద్రన్న విప్లవేతర, పార్టీయేతర వ్యవహారాల్లో కూరుకుపోయాడని ఆరోపించారు. పార్టీ కేంద్ర కమిటీని ఫంక్షనింగ్ చేయడంలో రాష్ట్ర కమిటీలకు సరైన విధంగా గైడ్ చేయడంలో విఫలమయ్యారని అన్నారు. విప్లవకారుల ఐక్యత విషయంలో పార్టీ అఖిల భారత మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించగా దాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రన్న సరైన పాత్ర పోషించలేదన్నారు. మార్చి 24న రెండు రాష్ట్రాలకు చెందిన 104 మంది ప్రతినిధులు పార్టీతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించామని గుర్తుచేశారు. పార్టీ శ్రేణులు వాస్తవాలను గ్రహించి న్యూడెమోక్రసీతో నిలబడాలని కోరారు.

ఎంసీహెచ్‌లో తాగునీటి ఎద్దడి

- ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు
- రవాణా సౌకర్యం కూడా అంతంతే..



ఎంసీహెచ్‌లో పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గర్భిణులు, బాలింతలతో పాటు వారికి సహాయకులుగా వచ్చేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రంలో గత 15 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఓ వైపు ఎండలు పెరుగుతున్న తరుణంలో తాగునీరు లేక దాహార్తి తీర్చుకోలేకపోతున్నారు. ఎంసీహెచ్ సిబ్బంది వాటర్ ట్యాంక్ కొనుగోలు చేసి తీసుకొస్తున్నా అవి ఎటూ సరిపోవడం లేదు. ఆస్పత్రిలో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదని కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు చెబుతున్నారు. ఆస్పత్రిలో ఉన్న బోర్లు సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో బాత్‌రూమ్‌లకు కూడా నీటి సరఫరా నిలిచిపోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇతర రాష్ట్రాల గర్భిణులు సైతం ఇక్కడికి..

జిల్లాలోని భద్రాచలం, చర్ల, ఇల్లెందు, మణుగూరు, దుమ్ముగూడెం, ఆశ్వారావుపేట, చండ్రుగొండ, జూలూరుపాడు తదితర మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సైతం గర్భిణులు ఈ మాతా శిశు సంరక్షణ కేంద్రానికి చికిత్స కోసం వస్తుంటారు. అయితే ఈ కేంద్రానికి సరైన రవాణా సౌకర్యం కూడా లేదు. రామవరం ప్రధాన రహదారి నుంచి ఎంసీహెచ్ కిలోమీటర్ దూరంలో ఉంటుంది. త్రీ ఇంక్లైన్ పంచాయతీలోని ప్రధాన రహదారి నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉంటుంది. ఆయా రోడ్లపై బస్సు దిగిన వారు ఆస్పత్రికి నడుచుకుంటూ రావాల్సిందే. కొందరు ఆటోలను ఆశ్రయిస్తున్నా.. చికిత్స అనంతరం తిరిగి వెళ్లేటప్పుడు ‘నడక యాతన’ తప్పడం లేదు. ఇక మాతా శిశు సంరక్షణ కేంద్రం వద్ద ఎలాంటి సౌకర్యాలూ లేవు. వైద్య సేవల కోసం ఇక్కడే ఉండాల్సి వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఏ చిన్న వస్తువు కావాలన్నా వెంట వచ్చిన సహాయకులు కిలోమీటర్ దూరం వెళ్లాల్సిందే. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఎంసీహెచ్‌పై అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రాదమోహన్‌ను వివరణ కోరగా సమస్యను కలెక్టర్ ప్రియాంక ఆల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

సారపాకలో పోలీసుల కార్డెన్ సెర్చ్



వాహనాలను సీజ్ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్‌లో శుక్రవారం తెల్లవారు జామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా గాంధీనగర్‌లోని ప్రతి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 25 మోటార్ సైకిళ్లను గుర్తించి వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరు అనుమానితులను గుర్తించి వారి వివరాలను సేకరించారు. తెల్లవారక ముందే పోలీసులు గాంధీనగర్ ఇళ్లలో సోదాలు నిర్వహిస్తుంటే ఏం జరిగిందోనని కొద్దిసేపు స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో బూర్గంపాడు ఎస్ఐలు సుమన్, నాగభిక్షం, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సింగరేణి క్వార్టర్ల వివరాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా క్వార్టర్ల వివరాలు ఇన్నాళ్లు వెబ్‌పోర్టల్‌లో పొందుపరుస్తుండగా కొత్త వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్, ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. శుక్రవారం ఆయన సంస్థ పరిధిలోని 11 ఏరియాల అధికారులతో కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కొత్త వెబ్‌సైట్‌లో సింగరేణి క్వార్టర్ల కేటాయింపు, ఖాళీలు, వాటి స్థితిగతుల వివరాలను పొందుపర్చాలని తెలిపారు. తద్వారా క్వార్టర్ ఖాళీ చేస్తే హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం, క్వార్టర్ తీసుకుంటే హెచ్‌ఆర్‌ఏ నిలిపేయడం వంటి ప్రక్రియ సులభమవుతుందని చెప్పారు. ఆ తర్వాత బొగ్గు గని కార్మికులు, ఉద్యోగుల సీఎంపీఎఫ్ క్లెయిమ్స్ పరిష్కారంపై సూచనలు చేశారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు రాంకుమార్‌రావు, కె.శ్రీనివాసరావు, హరిప్రసాద్, జీవీ మోహన్‌రావు, హరిశంకర్, హీర్యా, ఓ.కృష్ణయ్య, ముకుంద సత్యనారాయణ, అనిల్, ప్రవీణ్, కె.శివకుమార్, జీకే కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది ద్వారా ఆధార్ సేవలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా కార్యాలయాల్లో ఆధార్ సేవలు ఇక నుంచి శాఖ ఉద్యోగుల ద్వారానే అందనున్నాయి. పోస్టాఫీసుల్లో 2020 నుంచి ఆధార్ సేవలు అందుబాటులోకి రాగా తొలుత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. వీటి కాలపరిమితి మార్చి 31తో ముగియగా.. తపాలా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి సేవలు కొనసాగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో కొత్త ఆధార్ నమోదుతో పాటు తప్పుల సవరణ వంటి అంశాల్లో ఇప్పటికే ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలోని ఖమ్మం గాంధీచౌక్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్, జెడ్పీలోని తపాలా కార్యాలయంతో పాటు మధిర, ఎర్రుపాలెం, నేలకొండపల్లి, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, బూర్గంపాడు, చర్ల, అశ్వారావుపేట తపాలా కార్యాలయాల్లో ఇక నుంచి తపాలా శాఖ ద్వారా ఆధార్ సేవలు అందుతాయని డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు..



సుక్మా ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట ఇద్దరు మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. సుక్మా జిల్లా కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శి కలుమ ప్రకాష్‌తో పాటు పెదకం రీటా ఇద్దరు లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరిపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. సుక్మా జిల్లాలో జరిగిన పలు హింసాత్మక ఘటనల్లో ప్రకాశ్ ప్రమేయం ఉందని ఎస్పీ తెలిపారు. కాగా, లొంగిపోయిన రీటా.. మావోయిస్టు నేత నగేష్ భార్య అని వెల్లడించారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

ఏన్కూరు: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఏన్కూరు ఎస్ఐ బాదావత్ రవి తెలిపిన వివరాల ప్రకారం... ఏన్కూరు సమీపాన సాగర్ బ్రిడ్జి వద్ద ఏన్కూరుకు చెందిన ఎనిమిది మంది పేకాట ఆడుతున్నారనే సమాచారం ఎస్ఐ, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు పరారు కాగా, ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఐదు బైకులు సీజ్ చేయడంతో పాటు రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉరకలు..

- రోజురోజుకూ పెరుగుతున్న నీటిమట్టం
- తుపాకులగూడెం నుంచి 450 క్యూసెక్కుల నీరు విడుదల



కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద శుక్రవారం నుంచి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఐదు రోజులుగా ఆనకట్ట వద్ద 48.3 మీటర్ల నీటిమట్టం నిలకడగా ఉంది. ఇక్కడి మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్ ద్వారా గోదావరి నుంచి ప్రతిరోజు 150 ఎంఎల్‌డీ (61 క్యూసెక్కులు)లను జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో పది రోజుల కిందట ఆనకట్ట వద్ద 48 మీటర్లకు నీటిమట్టం పడిపోవడంతో తాగు అవసరాలకు ఇబ్బంది ఏర్పడుతుందని అధికారులు భావించారు. గతంలో ఆనకట్ట వద్ద అడుగంటి తాగునీటికి కొరత ఏర్పడడమేకాక భారజల కర్మాగారంలోనూ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా మిషన్‌భగీరథ, నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీటి విడుదల

గతంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిమట్టం తగ్గితే మేడిగడ్డ నుంచి నీరు విడుదల చేసేవారు. కానీ మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో చాన్నాళ్ల కిందట నీరంతా కిందకు వదిలేశారు. ఈ నేపథ్యాన నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ అధికారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఈ మేరకు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని గోదావరి నదిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ 59 గేట్లను గతనెల 12వ తేదీన పూర్తిగా మూసేసి నీరు నిల్వ చేశారు. ప్రస్తుతం బ్యారేజీలో 1.12 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి బ్యారేజీలోకి 1,200 క్యూసెక్కుల నీరు చేరింది. ఈ మేరకు ఈ నెల 3వ తేదీన సమ్మక్క సాగర్ బ్యారేజీ 59 గేట్లలో ఒకటి తెరిచి 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీరు చేరుతుండడంతో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో మే మొదటి వారం వరకు మిషన్ భగీరథ ఇన్ టేక్ వెల్ వద్ద నీటి సమస్య ఏర్పడదని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఇక్కడ గోదావరిలో నీరు తగ్గినా దుమ్ముగూడెం వైపు గోదావరిలో జేసీబీతో కాల్వలు తీయించి మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్ వైపు మళ్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

ప్రజోపయోగకర పనులు చేయాలి

త్రిదండి చినజీయర్ స్వామి



అనుగ్రహ భాషణం చేస్తున్న జీయర్ స్వామి

దమ్మపేట : ప్రతి ఒక్కరూ ప్రజోపయోగకరమైన పనులు చేసినప్పుడే సమాజం బాగుంటుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాసానికి శుక్రవారం రాత్రి వచ్చిన జీయర్‌స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామికి ఎమ్మెల్యే దంపతులు, కుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికి పాదపూజ చేశారు. అనంతరం నిర్వహించిన భక్తుల ఆత్మీయ సమ్మేళనంలో జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మరో ఐదు రోజుల్లో తెలుగు నూతన సంవత్సరం రాబోతోందని, ప్రస్తుత సంవత్సరంలో చేసిన మంచి పనుల కంటే వచ్చే ఏడాదిలో మరిన్ని ప్రయోజనకర పనులను చేయాలని సూచించారు. 500 ఎళ్ల నాటి అయోధ్య రామ మందిరం కల ప్రస్తుత సంవత్సరంలో నెరవేరిందని, రాబోయే సంవత్సరంలో దేశ చరిత్ర మరింతగా వృద్ధి చెందేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సమాజంలో మనం ఒక్కరమే జీవించడం కాకుండా తోటివారికి అవసరమైన తోడ్పాటు అందించాలని, అప్పుడే జీవితం సార్థకమవుతుందని అన్నారు. సమాజంలో మహిళల ఆరోగ్యమే ప్రముఖ పాత్ర పోషిస్తుందని, వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళా వికాస్ సంస్థ ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 35 ఏళ్లు దాటిన మహిళలకు కేన్సర్ సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బాల స్వర్ణామృత్ ప్రాశం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నెలకోసారి ఆ మందు అందిస్తామని, మూడు నెలల పాటు మందు వేస్తే పిల్లలు పలు రకాల అనారోగ్య సమస్యలను అధిగమిస్తారని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి సిద్ధం




అభివాదం చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

- ఆదివాసీల సంఘం నాయకుల సమాలోచనలు
- మానుకోట స్థానం నుంచి అభ్యర్థిని దింపేందుకు కసరత్తు

ఇల్లెందు: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ప్రధాన పార్టీలన్నీ లంబాడ సామాజిక వర్గం అభ్యర్థులకు టికెట్లు కేటాయించడంతో ఆదివాసీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు 18 ఆదివాసీ సంఘాల నాయకులు సమష్టిగా అభ్యర్థిని రంగంలోకి దింపాలనే ఆలోచనకు రాగా, శుక్రవారం ఇల్లెందులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఓట్లు చీలిపోకుండా ప్రధాన రాజకీయ పార్టీలకు గుణపాఠం నేర్పేలా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బరిలో నిలవగా, రెండు ఎన్డీ పార్టీలు ఉమ్మడిగా మోకాళ్ల మురళీకృష్ణను అభ్యర్థిగా ప్రకటించాయి. దీంతో ఇల్లెందులో సమావేశమైన ఆదివాసీ సంఘాల నాయకులు ఓట్లు చీలిపోకుండా ఒకే అభ్యర్థిని బరిలోకి దింపాలనే అంశంపై చర్చించారు. కాగా, ఉద్యోగం వదులుకుని 1974 నుంచి ఆదివాసీల అభ్యున్నతికి పనిచేస్తున్న తాను పోటీ చేయాలని భావిస్తుండగా సహకరించాలని చందా లింగయ్య కోరినట్లు తెలిసింది. అలాగే, మైపతి అరుణ్‌కుమార్, సోయం కన్నారావు సైతం పోటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. సమావేశంలో తుడుందెబ్బలోని మూడు సంఘాల నాయకులే కాక ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ సంఘాల జేఏసీ, గోండ్వానా సంఘం, ఆదివాసీ సేన, ఆదివాసీ ఉద్యోగుల సాంస్కృతిక సంఘం, మన్యసీమ తదితర సంఘాల నాయకులు చందా లింగయ్య, మైపతి అరుణ్‌కుమార్, సోయం కన్నారావు, రమణాల లక్ష్మయ్య, పూనెం శ్రీనివాస్, వట్టం ఉపేందర్, వట్టం నారాయణ, చిచ్చడి శ్రీరామ్మూర్తి, వాగబోయిన చంద్రయ్య, ఈసం నర్సింహారావు, ఆరెం పాపారావు, పాయం రవివర్మ, గుంపిడి వెంకటేశ్వర్లు, కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, వట్టం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులకు సత్కారం



మణుగూరుటౌన్: ఎస్పీ రోహిత్‌రాజుతో పోలీస్ సిబ్బంది

కొత్తగూడెంటౌన్/మణుగూరుటౌన్: సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రజల ప్రాణాలను కాపాడిన పోలీస్ కానిస్టేబుల్ వీరా, హోంగార్డు కృష్ణను శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో వారిద్దరు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడిన నాగరాజు, మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాయిగూడెం వద్ద గోదావరిలో హోలీ రోజున ఈతకు వెళ్లి సుడిగుండంలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను కాపాడిన కానిస్టేబుళ్లు సత్యనారాయణ, వినయ్, డయల్ 100కు ఫోన్ రాగానే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టిన కానిస్టేబుల్ వీరా, హోంగార్డు కృష్ణను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో పనిచేస్తూ నిత్యం విధులు నిర్వర్తించడమే కాకుండా ప్రజల ప్రాణాలను స్వయంగా కాపాడటంలో సమయస్ఫూర్తి, ధైర్య సాహసాలను ప్రదర్శించిండం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇల్లెందు సీఐ కరుణాకర్, మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్విచక్రవాహనం

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తలంకపల్లికు చెందిన చింతల వెంకటేశ్వర్లు, పాసం దుర్గారావు శుక్రవారం వీఎం బంజర్ నుండి కొత్తలంకపల్లి వెళ్తుండగా లంకపల్లి సమీపాన జాతీయ రహదారిపై మూల మలుపు వద్ద ఉన్న సూచిక బోర్డును అదుపు తప్పి వేగంగా ఢీకొట్టారు. దీంతో వాహనం నడుపుతున్న వెంకటేశ్వర్లు(40)కు తీవ్ర గాయాలై ఒక కాలి పాదం తెగిపోయింది. ఆయనతో పాటు ఉన్న దుర్గారావుకు సైతం తీవ్రగాయాలు కాగా పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ఆయనకు మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె. వెంకటేష్ తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

గుండాల: రెండు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయి న వ్యక్తిని పోలీసులు పట్టుకు ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలానికి చెందిన శ్రీనివాస్ కుటుంబంతో కలిసి రెండేళ్ల కిందట బతుకుతెరువు కోసం గుండాలకు వచ్చాడు. రెండు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. శ్రీనివాస్ పాల్వంచలో ఉన్నట్లు సమాచారం అందుకుని, ఆయన్ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది వెంకట్, రాంబాబు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మద్యం సీజ్

దమ్మపేట: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎఫ్ఎస్‌టీం తనిఖీ చేసి, స్వాధీనం చేసుకుంది. ఎఫ్ఎస్‌టీం అధికారి చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గురువారం రాత్రి పది గంటల సమయంలో ఆటోలో అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్నారనే సమాచారం అందింది. ఎఫ్ఎస్‌టీం అధికారి, సిబ్బంది మండలంలోని గోపాలపురం గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించి, మద్యం తరలిస్తున్న 192 లీటర్ల మద్యం, 24 బీర్లను స్వాధీనం చేసుకొని, అశ్వారావుపేట ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. కేసు నమోదు చేశారు. మద్యం విలువ రూ.1,42,000 ఉంటుందని ఎఫ్ఎస్‌టీం అధికారి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ శ్రీను కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొనేరుబజారుకు చెందిన బండి నాగరాజు (40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపం చెంది మూడు రోజుల కిందట గడ్డి నివారణ మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్న క్రమంలో గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య కొన్నేళ్ల కిందటే మృతి చెందగా, ఇద్దరు సంతానం ఉన్నారు. స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి తండ్రి బండి చినకృష్ణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి..

పాల్వంచరూరల్: మామిడి కాయలను తింటున్న కోతుల మందను కొట్టేందుకు చెట్టు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన ఘటన రంగాపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రంగాపురం వద్ద పెనుబెల్లి మండలం రామసీతారాం గ్రామానికి చెందిన హనుమా మామిడి తోటను లీజుకు తీసుకున్నాడు. హనుమా బంధువైన మడకం దేవ(40) మామిడితోట వద్దకు వచ్చాడు. శుక్రవారం కోతులగుంపు చెట్ల మీదకు రావడంతో వాటిని తరిమేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ బి.శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

బీజాపూర్ – దంతెవాడ సరిహద్దుల్లో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ – దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. దంతెవాడ జిల్లాలోని కిరండోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పురంగేల్, బాదేపల్లి, దోడీతుమ్మానర్, గంపూర్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు దంతెవాడ, బీజాపూర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ 231 బెటాలియన్, యంగ్‌ప్లాటూన్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుకుంటూ పారిపోతుండగా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ క్రమంలో ఒక మావోయిస్టు మృతి చెందగా, మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని దంతెవాడకు తరలించారు. ఘటనా ప్రాంతం నుంచి ఒక తుపాకీ, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు తప్పించుకుని పారిపోగా వారి కోసం కూంబింగ్ ముమ్మరం చేశారు.

ఆన్‌లైన్ లింక్‌తో నగదు స్వాహా

పాల్వంచ: ఆన్‌లైన్ లింక్‌తో సైబర్ నేరగాళ్ల మోసానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన నస్రీన్ ఫోన్‌కు ఇటీవల ఓ లింక్ వచ్చింది. ఈ లింక్‌ను ఓపెన్ చేయడం వల్ల రేటింగ్ వస్తుందని, దాని ద్వారా నగదును పొందే అవకాశం ఉందని మెసేజ్ పంపించారు. దీనికి కొంత అమౌంట్ పంపిస్తే మళ్లీ పెద్ద మొత్తంలో నగదు పొందే అవకాశం ఉందని ఆశ చూపించారు. దీంతో నస్రీన్ రూ.62 వేలు నగదును పంపింది. అనంతరం అటు వైపు నుంచి పెద్ద మొత్తంలో నగదు పంపినట్లు ఫేక్ మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రాఘవయ్య శుక్రవారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధం



కాలిపోయిన బైక్

దమ్మపేట: కారును వెనుక నుంచి ఢీకొట్టిన బైక్ దగ్ధమైన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం వరంగల్ నుంచి అశ్వారావుపేటకు ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యే నిమిత్తం నలుగురు మిత్రులు కారులో వస్తున్నారు. వారు దమ్మపేట మండలంలోని ముష్టిబండ గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కుక్కలను చూసి కారు వేగాన్ని ఒక్కసారిగా తగ్గించారు. వెనుకనే అశ్వారావుపేటకు చెందిన ఇద్దరు యువకులు తొర్లపాటి తేజ, ముల్లపిరి మహేశ్ బైక్‌పై వస్తున్నారు. కారు వేగం తగ్గగానే వీరు బైక్‌తో కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ క్రమంలో బైక్ రోడ్డు పక్కన గల గోతిలో పడిపోగా, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే బైక్ పూర్తిగా దగ్ధమైంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు గాయపడగా అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

ఇల్లెందు: పట్టణంలోని సీతారామ టాకీస్ ఏరియాలో శుక్రవారం ఓ ఇంట్లో అధిక ఉష్ణోగ్రతకు గ్యాస్ సిలీండర్ లీకై అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టు పక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని బాధితుడు సత్యనారాయణ తెలిపారు. ఫైర్ ఆఫీసర్ రామారావు, వెంకటేశ్వర్లు, జితేందర్, నరేశ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కీచక గురువుపై సస్పెన్షన్ వేటు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాధు సమాధానాన్ని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన విద్యార్థినులతో అసభ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో పోక్సో కేసు నమోదు చేసిన మధిర పోలీసులు మార్చి 31న రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సమాధానంకు గురువారం బెయిల్ మంజూరు చేయగా విడుదలయ్యారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
బి.సి.యం. రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953), అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

స్వాధీనతా ప్రకటన (లాంచన ప్రాయం)
రూల్ నెం. 8(1) మరియు (2) కింద (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో మరియు సదరు చట్టంలోని సెక్షన్ 13(2)తో చదువబడే విధంగా సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బి.సి.యం.రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953) అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 15-05-2023 తేది గల డిమాండ్ నోటీస్ జారీచేసి ఋణగ్రహీత **శ్రీసోమిశెట్టి వేంకటతిరుమల కొండయ్య, తండ్రి : శ్రీ నరసింహులు,** ఇం.నెం.4-26/B, BSR నగర్, పిరాయిగూడెం, అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తెలిపిన మొత్తం 15-05-2023 నాటికి రూ॥ 12,92,956/- (రూపాయలు పన్నెండు లక్షల తొంభై రెండు వేల తొమ్మిది వందల యాభై ఆరు మాత్రమే) మరియు ఇతర ఖర్చులు.

శ్రీసోమిశెట్టి వేంకట తిరుమల కొండయ్య, తండ్రి : శ్రీ నరసింహులు,
ఇ.నెం. 4-26/B, BSR నగర్, పిరాయిగూడెం,
అశ్వారావు పేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
A/c. No. సి.సి. : 62475032837
హామీదారులు : శ్రీ దూపకుంట్ల బాలకృష్ణ, తండ్రి : సత్యనారాయణ

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు ది. 02-04-2024న స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలు అయిన ది. 31-03-2024 నాటికి రూ॥ 12,86,842/- (రూపాయలు పన్నెండు లక్షల ఎనభై ఆరు వేల ఎనిమిది వందల నలభై రెండు మాత్రమే) మరియు ఇతర ఖర్చులు కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బి.సి.యం. రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953), అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి చార్జికి లోబడి జరుపవలెనని ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరములు (డాక్యుమెంట్ ప్రకారం) :

SRO సత్తుపల్లి వద్ద, అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలో సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 3729/2016, తేది : 25-07-2016 ప్రకారం శ్రీ సోమిశెట్టి వెంకట తిరుమల కొండయ్య, తండ్రి: శ్రీ నరసింహులు పేరున కలిగి వుండిన ఫ్లాట్ నెం. 3 (ఇ.నెం. 9-47/బి3) గ్రౌండ్ ఫ్లోర్ 1160 చ॥అడుగుల లక్ష్మీ హోమ్స్ 48.475 చ.గ. విభజనకాని భాగం, 1939 చ.గ.లో సర్వే నెం. 1283, 1246లో ప్లాట్ నెం. 29, 30, 31, 32, 33, 55, 56, 57, 58, 59 గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు** : 6.6. వెడల్పు గల కారిడార్, **పడమర** : శీమకుర్తి బాలకృష్ణ మరియు ఇతరులు, **ఉత్తరం** : లక్ష్మీ హోమ్స్ 2 అపార్ట్‌మెంట్, **దక్షిణం** : ఫ్లాట్ నెం. 2

సం/-
తేది : 06.04.2024. **అధీకృత అధికారి**
స్థలం : అశ్వారావు పేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భారతీయ స్టేట్ బ్యాంక్
బి.సి.యం. రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953), అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

స్వాధీనతా ప్రకటన (లాంచన ప్రాయం)
రూల్ నెం. 8(1) మరియు (2) కింద (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో మరియు సదరు చట్టంలోని సెక్షన్ 13(2)తో చదువబడే విధంగా సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుటకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బి.సి.యం.రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953) అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 15-05-2023 తేది గల డిమాండ్ నోటీస్ జారీచేసి ఋణగ్రహీత **M/s. హనుమాన్ రెడీమేడ్స్ మరియు క్లాత్ షో రూమ్, ప్రా॥ శ్రీసోమిశెట్టి వేంకటతిరుమల కొండయ్య, తండ్రి : శ్రీ నరసింహులు,** ఇం.నెం.4-26/B, BSR నగర్, పిరాయిగూడెం, అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తెలిపిన మొత్తం 15-05-2023 నాటికి రూ॥ 16,36,886/- (రూపాయలు పదహారు లక్షల ముప్పై ఆరు వేల ఎనిమిది వందల ఎనభై ఆరు మాత్రమే) ((i) సి.సి. లోన్ మొత్తం రూ॥ 14,92,643/- (రూపాయలు పద్నాలుగు లక్షల తొంభై రెండు వేల ఆరు వందల నలభై మూడు మాత్రమే) (ii) జి.ఇ.సి.యల్. లోన్ మొత్తం రూ॥ 1,44,243/- (రూపాయలు ఒక లక్ష నలభై నాలుగు వేల రెండు వందల నలభై మూడు మాత్రమే) మరియు ఇతర ఖర్చులు.

M/s. హనుమాన్ రెడీమేడ్స్ మరియు క్లాత్ షో రూమ్,
ప్రా॥ శ్రీసోమిశెట్టి వేంకట తిరుమల కొండయ్య, తండ్రి : శ్రీ నరసింహులు,
ఇ.నెం. 4-26/B, BSR నగర్, పిరాయిగూడెం,
అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
A/c. No. సి.సి. : 62446602768, జి.ఇ.సి.యల్. : 39377683193
హామీదారులు : శ్రీ దూపకుంట్ల ఉమా మహేశ్వరి, భర్త : మోహన్‌రావు

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు ది. 02-04-2024న స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలు అయిన ది. 31-03-2024 నాటికి రూ॥ 16,07,182/- (రూపాయలు పదహారు లక్షల ఏడు వేల ఒక వంద యనభై రెండు మాత్రమే) (i) సి.సి.లోన్ మొత్తం రూ॥ 15,48,854/- (రూపాయలు పదిహేను లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల యాభై నాలుగు మాత్రమే) (ii) జి.ఇ.సి.యల్ లోన్ మొత్తం రూ॥ 58,328/- (రూపాయలు యాభై ఎనిమిది వేల మూడు వందల ఇరవై ఎనిమిది మాత్రమే) మరియు ఇతర ఖర్చులు కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బి.సి.యం. రోడ్, అశ్వారావుపేట బ్రాంచ్ (20953), అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి చార్జికి లోబడి జరుపవలెనని ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరములు (డాక్యుమెంట్ ప్రకారం) :

SRO సత్తుపల్లి వద్ద, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం పరిధిలో సర్వే నెం. 1133/4/ఎ లో 510.00 చదరపు గజాల విస్తీర్ణంలో RCC భవనం, ఇ.నెం. 7-132/2, గాంధీబొమ్మ సెంటర్, అశ్వారావుపేట రెవిన్యూ గ్రామం మరియు మండలం, ఖమ్మం జిల్లా (భద్రాద్రి కొత్తగూడెం న్యూ) ప్రకారం శ్రీమతి దూపకుంట్ల ఉమామహేశ్వరి, భర్త : శ్రీ మోహన్‌రావు పేరున కలిగివుండి ఇ.నెం. 6-2, గాంధీబొమ్మ సెంటర్, అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయతీ రోడ్డు, **పశ్చిమం** : శ్రీ కె. రామారావు గారి స్థలం, **ఉత్తరం** : శ్రీ కుంజా సుబ్బారావు గారి స్థలం, **దక్షిణం** : శ్రీ దూపకుంట్ల సత్యనారాయణ గారి స్థలం.

సం/-
తేది : 06.04.2024. **అధీకృత అధికారి**
స్థలం : అశ్వారావు పేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆరోగ్యానికి 6 రుచులు



త్వరలో ఉగాది వస్తోంది. ఆరు రుచులున్న ఉగాది పచ్చడిని ఈ రోజు తప్పనిసరిగా సేవించడం ఈ పండగ ఆచారం. ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి సేవిస్తే ఆయా రుచుల్లాగే సంవత్సరమంతా మనకు ఆయా ఫలాలు అందుతాయని, అలా రకరకాల అనుభవాలూ, అనుభూతులను ఆస్వాదించడమే జీవితమని పెద్దలు చెబుతారు. అయితే అలా కేవలం ఉగాది నాడు మాత్రమే కాదు, వీలయితే ప్రతిరోజూ ఆరు రుచుల ఆహారాలను తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఏయే రుచులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం.



1. తీపి

శరీరంలోని వాత, పిత్త దోషాలను ఈ రుచి సమం చేస్తుంది. తీపి పదార్థాలను తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుంది, శరీరం దృఢంగా మారుతుంది. శక్తి అందుతుంది. శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. అయితే వీటిని చాలా తక్కువగా తినాలి. లేదంటే శరీరంలో కఫ దోషం పెరుగుతుంది. ఫలితంగా అధిక బరువు, స్థూలకాయం, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయి. కనుక ఈ రుచి ఉన్న ఆహారాలను నిత్యం తక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



2. పులుపు

వాత దోషాలను పులుపు తగ్గిస్తుంది. పులుపు రుచి ఉన్న ఆహారాలను తినడం వల్ల ఆకలి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉండవు. నిమ్మ, చింతకాయ వంటి పులుపు ఉన్న ఆహారాలను నిత్యం పరిమితంగా తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా తీసుకుంటే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. కనక పులుపు ఆహారాలను కూడా తక్కువగా తీసుకోవాలి.



3. ఉప్పు

ఉప్పు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల వాత దోషం తగ్గుతుంది. ఉప్పు అధికమైతే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. ఉప్పు ఉన్న ఆహారాల వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. కణాలు శుభ్రమవుతాయి. ఉప్పు ఉన్న పదార్థాలను కూడా తక్కువగా తీసుకోవాలి. ఎక్కువైతే బీపీ పెరుగుతుంది. గుండె జబ్బులు వస్తాయి.



4. కారం

కారపు రుచి గల ఆహారాలను తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఆకలి వేస్తుంది. కణాలు శుభ్రమవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. కఫ దోషం తగ్గుతుంది. కారం ఎక్కువైతే పిత్తదోషం పెరుగుతుంది. అందు వల్ల కారాన్ని నిత్యం తక్కువగానే తీసుకోవాలి.



5. చేదు

చేదుగా ఉన్న పదార్థాలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. పిత్త, కఫ దోషాలు తగ్గుతాయి. చేదుగా ఉన్న పదార్థాలను నిత్యం కొద్దిగా ఎక్కువ మోతాదులో తీసుకున్నా పెద్దగా సమస్యలు ఉత్పన్నం కావు.

6. వగరు

వగరు ఉన్న పదార్థాలను కూడా నిత్యం తినాలి. కానీ వీటిని తక్కువగా తీసుకోవాలి. లేదంటే జీర్ణాశయంలో గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇక పిత్త దోషం ఉన్న వారికి ఈ రుచి ఉన్న పదార్థాలు ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి అరటి పండ్లు, క్రాన్ బెర్రీలు, గ్రీన్ బీన్స్ వంటివి ఈ రుచి ఉన్న పదార్థాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

అయితే భోజనం చేసేటప్పుడు ఒకేసారి ఆరు రుచులు కలిసిన పదార్థాలను తినాల్సిన పనిలేదు. రోజులో మొత్తంగా చూసుకుంటే ఈ ఆరు రుచులు ఉన్న పదార్థాలను తిన్నామా లేదో అని చెక్ చేసుకుంటే చాలు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో ఈ ఆరు రుచుల నుంచి ఏవైనా రెండు రుచులు కలిగిన ఆహారాలను ఎంచుకుని తింటే చాలు. అంటే ఉదయం చేదు, కారం, మధ్యాహ్నం తీపి, వగరు, రాత్రి పులుపు, ఉప్పు.. ఇలా రెండేసి రుచులు ఉండేలా ఆహారాలను తీసుకుంటే చాలు. ఇవే తినాలని ఏమీ లేదు. ఎవరికి నచ్చినట్లు వారు ఆహారాలను ఎంచుకుని ఆరు రుచులు కవర్ అయ్యేలా చూసుకుంటే చాలు.

హెల్త్ టిప్స్

- రోజూ కప్పు నల్ల ద్రాక్ష రసం తీసుకుంటే గుండెపోటుకు దూరంగా ఉండవచ్చు.
- పడుకునేటప్పుడు ఎడమ పక్కకు తిరిగి పడుకుంటే ఎసిడిటి రాదు.
- 10 తులసి ఆకుల రసం ఒక కప్పు చొప్పున రెండు పూటలా తీసుకుంటే చర్మ వ్యాధులు, రాషెస్ కు సంబంధించి వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- రెండు స్పూన్లు ఉసిరి రసం, తేనెను అర కప్పు నీటిలో బాగా కలిపి 3 పూటలా సేవిస్తే బీపీ తగ్గుముఖం పడుతుంది.

మీకు తెలుసా?

'రోజు ఒక కప్పు ఉడకబెట్టిన శనగలు తింటే...
- గుండె జబ్బులు దరిచేరవు.
- రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- కాలేయం సమస్యల నుంచి త్వరగా కోలుకుంటారు.
- ఒత్తిడి, ఆందోళన దూరం అవుతాయి.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- ఎముకలు దృఢంగా మారుతాయి.
- రక్త సరఫరా మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుంది.

వేసవి తాపానికి కర్బూజ పండు



వేసవిలో మనకు విరివిగా దొరికే పండు కర్బూజ. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. కర్బూజ పండులో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటి శాతాన్ని భర్తీ చేయడానికి కర్బూజ పండు బాగా ఉపయోగపడుతుంది. కర్బూజ ముఖ్యంగా శరీరంలోని వేడిని, అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.

- కర్బూజ పండులో ఎక్కువ శాతం ఉండే బీటాకెరోటిన్ క్యాన్సర్‌కు దారితీసే ఫ్రీ–రాడికల్స్‌ని తొలగిస్తుంది. దీనిలో ఉన్న విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలో తెల్ల రక్త కణాలు వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది.
- కర్బూజ లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటాయి. దీనివల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా జరిగేలా ఉపయోగపడుతుంది.
- కర్బూజలో అధిక మోతాదులో ఉండే పొటాషియం గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి మరియు గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- ఖర్బూజలో తక్కువ క్యాలరీస్ కలిగి ఎక్కువగా పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- కర్బూజ రసం తాగడం వల్ల మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. ఈ పండులో ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం వలన గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు బాగా తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది.

వేసవిలో కర్బూజ పండు ముక్కలతో పాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చు.





ముందే జాగ్రత్త పడదాం...

ఇంకా ఏప్రిల్ మొదటివారంలోనే ఉన్నాం. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. వివిధ వృత్తి ఉద్యోగ వ్యాపారాల రీత్యా రోజూ ఎండలోకి వెళ్లక తప్పనివారిని వేధించే సమస్య వడదెబ్బ. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు కొన్ని...

ముందు జాగ్రత్తలు

ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటి శాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది, అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఎండలో తిరగటంతో రక్తకణాలు కుచించుకుపోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి ● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగుతుండాలి ● బయటకు వెళ్లేప్పుడు తప్పకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకోవడం, నీళ్ల సీసా తీసుకెళ్లడం తప్పనిసరి. ● మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడం వల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. ● శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని ఒక గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ● ఉడికించిన పచ్చి మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

● నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది. ● వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటి మీద నీళ్లు చల్లుతూ ఉండాలి. గ్లాసుడు నీటిలో నిమ్మరసం, చిటికడు ఉప్పు కలిపి తాగిస్తుండాలి ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇచ్చిన వడదెబ్బ నివారణ అవుతుంది ● వడగళ్ళు పడినపుడు ఆ ఐస్ గడ్డలను ఏరి విభూతిలో వేసి నిలువ ఉంచి జాగ్రత్తగా దాచి ఆ విభూతిని మూడువేళ్ళకు వచ్చినంత తీసుకుని మంచినీటిలో వేసి వడదెబ్బ తగిలిన వారికి ఇస్తే వడదెబ్బ నివారణ అవుతుంది ● తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి ● లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగ లో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి ● వేడి వేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి.

ఎండవేళలో తప్పనిసరిగా బయటకు వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

సినిమా


● ప్రభాస్

సరికొత్త ప్రయత్నం?

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడే అవకాశం ఉందట. కాగా ఈ చిత్రం యూనిట్ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ చిత్రంలో లీడ్ రోల్స్‌లో కనిపించే ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్‌ల పాత్రలకు సంబంధించిన పూర్వాపరాలను, ఆ పాత్రల తీరు తెన్నులను చెబుతూ ఓ యానిమేటెడ్ వీడియోను రెడీ చేస్తున్నారట. ఈ వీడియో నేరుగా ఓటీటీ ప్లాట్ ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని భోగట్టా. ఈ వీడియోలోని తన పాత్రకు ప్రభాస్ ఇప్పటికే డబ్బింగ్ కూడా పూర్తి చేశారని తెలిసింది. అయితే ఈ యానిమేటెడ్ వీడియో ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఎప్పట్నుంచి స్ట్రీమింగ్ కానుంది? వీడియో నిడివి ఎంత? అసలు వార్తల్లో ఉన్నట్లు యానిమేటెడ్ వీడియో షూట్ జరిగిందా? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.


● రష్మిక

బర్త్‌డే స్పెషల్

'పుష్ప: ది రైజ్' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు రష్మికా మందన్న. ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్న రష్మికా మందన్న పుట్టినరోజు ఏప్రిల్ 5. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రాలు 'పుష్ప 2: ది రూల్', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్ బో' నుంచి బర్త్ డే స్పెషల్‌గా ఆమె కొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్'లో ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఈ ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఇదిలా ఉంటే.. రష్మికా మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ మూవీ 60 శాతం షూటింగ్ పూర్తయింది. అదే విధంగా రష్మిక లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో చిత్రం 'రెయిన్‌బో'. శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి కూడా రష్మిక లుక్ విడుదలైంది.

రామాయణ్‌కు సంగీతం?


● హన్స్ జిమ్మెర్, ఏఆర్ రెహమాన్

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ హిందీ 'రామాయణ్'కు సంగీతం అందించనున్నారన్నది తాజా టాక్. రామాయణం ఆధారంగా దర్శకుడు నితీష్ తివారీ 'రామాయణ్' అనే ట్రయాలజీని తెరకెక్కిస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడి పాత్రలో యశ్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నటీనటుల పేర్లను యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా 'రామాయణ్' ట్రయాలజీకి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హాలీవుడ్‌లో 'ది లయన్ కింగ్' (యానిమేటెడ్) 'డ్యూన్', 'గ్లాడియేటర్', 'ఇన్సెప్షన్' వంటి హిట్ సినిమాలకు హన్స్ జిమ్మెర్ సంగీతం అందించారు. 'ది లయన్ కింగ్', 'డ్యూన్' సినిమాలకు గాను హన్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డులు వచ్చాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఏఆర్ రెహమాన్‌కు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా వచ్చే శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణ్' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాలనుకున్నారట మేకర్స్. మరి... ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారా? నటీనటులు ఎవరు? అనేది ఆ రోజు తెలిసిపోతుంది. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్, మధు మంతెన దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట.

ఏమయ్యిందే..!


● అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో వారణాసి మానస హీరోయిన్. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఏప్రిల్ 5) అశోక్ గల్లా బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అశోక్, మానసల మధ్య వచ్చే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉంది.

● ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో అశోక్ గల్లా హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'లవర్', 'మ్యాడ్' చిత్రాల ఫేమ్ శ్రీ గౌరీప్రియ కథానాయికగా నటించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు నిర్మాతలు.

ఇక వ్యక్తిగత జీవితంపై ఫోకస్


● తాప్సీ

వ్యక్తిగత జీవితానికి తాను ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చుకోవాల్సిన తరుణం వచ్చిందన్నట్లుగా మాట్లాడుతున్నారు హీరోయిన్ తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహం గత నెల 23న ఉదయ్‌పూర్‌లో జరిగిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాప్సీ, మథియాస్ తమ పెళ్లి గురించి అధికారికంగా ప్రకటించలేదు. కానీ వధూవరులుగా తాప్సీ, మథియాస్ ఉన్న వీడియోలు వైరల్ అవుతుండటంతో వీరిద్దరికీ వివాహం జరిగిందని స్పష్టమైంది. కాగా పెళ్లి తర్వాత తాప్సీ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''కొన్నేళ్లు గడిచిన తర్వాత నేను నటించిన సినిమాల జాబితాను ఓ సారి చూసుకున్నప్పుడు ఆ జాబితా నాకు సంతోషాన్నివ్వాలి. ఎందుకంటే నా జీవితంలోని ఎక్కువ సమయాన్ని సినిమాలకే కేటాయించాను. 24 గంటల్లో నేను పన్నెండు గంటలు పని చేసిన రోజులూ ఉన్నాయి. అయితే ఇకపై నేను నా వృత్తి జీవితంపైకన్నా, వ్యక్తిగత జీవితంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ సినిమా వదులుకోకూడదు అనిపించేంత మంచి స్క్రిప్ట్ అయితేనే చేయాలనుకుంటున్నాను. కెరీర్‌కి మించిన జీవితం ఒకటి ఉంటుంది. ఆ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులతో సమయం గడపాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు తాప్సీ.



● మథియాస్, తాప్సీ

బ్యాక్ టు షూట్


● ప్రియాంకా చోప్రా

దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి నటిగా మేకప్ వేసుకున్నారు ప్రియాంకా చోప్రా. ఇద్రిస్ ఎల్బా, జాన్ సెనా, ప్రియాంకా చోప్రా, జాక్ క్వాయిడ్, స్టీఫెన్ రూట్ ప్రధాన పాత్రధారులుగా హాలీవుడ్‌లో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే కామెడీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఇలియా నైషుల్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో మొదలైంది. ''..అండ్ వుయ్ ఆర్ బ్యాక్..'' అంటూ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమా స్క్రిప్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. దీంతో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' షూట్‌లో ఆమె పాల్గొంటున్నారని స్పష్టమైంది. ఇక రెండు నెలల క్రితం తన వ్యక్తిగత పనుల కోసం ప్రియాంకా చోప్రా ఇండియా వచ్చారు. సోదరుడు సిద్ధార్థ్ చోప్రా నిశ్చితార్థం వేడుకలో చురుగ్గా పాల్గొన్నారు ప్రియాంక. ఈ వేడుకతో పాటు మరికొన్ని పనులను చక్కబెట్టుకుని ప్రియాంకా చోప్రా మళ్లీ నటిగా బిజీ అవుతున్నారు.

స్నేహం నేపథ్యంలో...


● సత్యదేవ్

దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్ కీలక పాత్రధారులు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా మే 3 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కృష్ణ కొమ్మాలపాటి మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమాతో సత్యదేవ్ మరో రేంజ్‌కి చేరుకుంటారు. కాలభైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్నేహం విలువను చూపిస్తున్నాం'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.

భవనమ్‌లో థ్రిల్


● అజయ్

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ట్యాగ్‌లైన్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్‌బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాచారి కూరెళ్ల దర్శకుడు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ హారర్‌తో పాటు కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: మురళీమోహన్ రెడ్డి ఎస్.